క్లుప్తంగా

కొమ్మలు తొలగించారు!



నాదెండ్ల: అమీన్‌సాహెబ్‌పాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వద్ద విద్యుత్ తీగలు ప్రమాదభరితంగా మారాయంటూ సాక్షి దినపత్రికలో గత నెల 29న ప్రచురితమైన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. విద్యుత్‌శాఖ ఏఈ ప్రసాద్ కరెంటు తీగలకు చెట్ల కొమ్మలు తగిలి షార్ట్ సర్క్యూట్ ప్రమాదం ఉండటంతో చెట్ల కొమ్మలను సిబ్బందితో తొలగించారు. బోడి వెంకటేశ్వర్లు నివాసం ముందు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండటంతో దాని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు

సాక్షి స్పందన

సౌత్‌జోన్ పోటీలకు ధనలక్ష్మి కళాశాల విద్యార్థి ఎంపిక



ఈపూరు(శావల్యాపురం): మండలంలోని ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎం. రాజేశ్వరి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహిళల క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టరు చుండు వెంకటరావు శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల చివరి వారంలో మైసూరు విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న దక్షిణ మండల విశ్వవిద్యాలయం పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థిని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు ఆర్‌బీ నాయక్, అరవింద్, దాసు, వంశీ అభినందించారు.

మారెళ్లవారిపాలెంలో క్రికెట్ టోర్నీ ప్రారంభం



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని క్రికెట్ టోర్నీని ప్రముఖ వైద్యుడు అమ్మిరెడ్డి నాగార్జునరెడ్డి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ జయరామిరెడ్డి, తుమ్మా వెంకటరెడ్డి, గంధం బాలిరెడ్డి, నక్కా నాగిరెడ్డి, మారెళ్లవారిపాలెం సర్పంచి నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.2.5 లక్షల విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన రవి స్వీట్స్ నిర్వాహకులు రెడ్డి సత్యనారాయణ, ధనలక్ష్మి దంపతులు రూ.2.5 లక్షల విరాళాన్ని అందజేశారు. ఆలయ కార్యాలయంలో శనివారం విరాళం చెక్‌ను ఈఓ ఎస్.మాధవిదేవి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల సమక్షంలో శిల్పికి అందించారు.

గీతమ్స్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు



వినుకొండ(నూజెండ్ల): స్థానిక సిద్ధార్థ నగర్‌లోని గీతమ్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి పాల్గొని చిన్నారులను భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు, హరిదాసు వేషధారణ విశేషంగా అలరించాయి. సంక్రాంతి పండుగ విశిష్టత గురించి చిన్నారులకు వివరించారు.

ఘనంగా సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి

వినుకొండ(నూజెండ్ల): బ్రిటీష్ తెల్లదొరలను తరిమియడంలో అసువులు బాసిన స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న విశిష్ట వ్యక్తిత్వం గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, విగ్రహ కమిటీ చైర్మన్ పల్లపు వెంకటేశ్వర్లు అన్నారు. వడ్డే ఓబన్న జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ఉన్న ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓబన్నను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సౌదాగర్ జానీబాషా, బత్తుల నరసింహారావు, బాలరాజు, దేవల ప్రసాద్, పల్లపు పున్నయ్య, బత్తుల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరమైన ఈకేవైసీ కార్యక్రమం

- వ్యవసాయ పనుల వల్ల కొంతమేర జాప్యం
- లక్ష్యాల సాధన దిశగా సిబ్బంది



గృహాలకు వెళ్లి సభ్యులకు ఈకేవైసీ చేస్తున్న సొసైటీ, సచివాలయ సిబ్బంది

రొంపిచర్ల: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో ఇప్పటి వరకు చేతివ్రాత తోనే పుస్తకాలలో రికార్డులు నిర్వహిస్తున్నారు. ఈ పద్ధతికి స్వస్తి చెప్పి ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి సహకార సంఘాల్లో సభ్యుల లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే నిర్వహించేందుకు కంప్యూటరీకరణ కార్యక్రమం ముమ్మరంగా సాగుతుంది. అందులో భాగంగా సొసైటీలో ఉన్న సభ్యులందరికీ ఈకేవైసీ చేయాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 60 సహకార సంఘాల్లో 77553 మంది సభ్యులు ఉండగా, రొంపిచర్ల మండలంలో ఉన్న 6 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో 4536 మంది సభ్యులకు ఈకేవైసీ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 3039 మందికి ఈకేవైసీ కార్యక్రమం పూర్తి అయి 67 శాతం లక్ష్యాలను సాధించారు. మరో రెండు రోజుల్లో మిగిలిన 1497 మందికి ఈకేవైసీ పూర్తి చేసి నూరు శాతం లక్ష్యాలను సాధించే దిశగా సొసైటీల సిబ్బంది, సచివాలయాల సిబ్బంది సమన్వయంతో పని చేస్తున్నారు. ఇప్పటి వరకు ఈకేవైసీ చేసిన సభ్యుల వివరాలు ఇలా ఉన్నాయి.అలవాల గ్రామ సచివాలయం పరిధిలో 260 మంది సభ్యులు ఉండగా 184 మంది సభ్యులకు మాత్రమే ఈకేవైసీ పూర్తి అయ్యింది. అన్నవరం సచివాలయ పరిధిలో 212 మంది సభ్యులు ఉండగా 168 మందికి, ఆరేపల్లి సచివాలయంలో 91 మందికి గాను 56 మందికి, బుచ్చిబాపన్నపాలెంలో 141 మందికి గాను 121, మందికి కొత్తపల్లి పరిధిలో 188కి 153, గోగులపాడులో 320కి 85, కర్లకుంటలో 223కి 208, మాచవరంలో 190కి 176, మునుమాకలో 114కి 99 మంది, నల్లగార్లపాడులో 62కి 56 మంది, రొంపిచర్లలో 530కి 329, సంతగుడిపాడులో 826కి 344, తురిమెళ్లలో 304కి 252, వి.రెడ్డిపాలెంలో 243కి 212, వడ్లమూడివారిపాలెంలో 178కి 153, వీరవట్నంలో 359కి 317, విప్పర్లలో 122కి 98, విప్పర్లపల్లి సచివాలయం పరిధిలో 173 సభ్యులు ఉండగా 28 మంది సభ్యులకు మాత్రమే ఈకేవైసీ పూర్తి అయ్యింది. మిగిలిన సభ్యులకు కూడా ఈకేవైసీ పూర్తి చేసేందుకు గ్రామాల్లో దండోరాలు, ఆటో మైకు ప్రచారాలు కూడా నిర్వహిస్తున్నారు. సచివాలయం, సొసైటీల సిబ్బంది ఇంటింటికీ తిరిగి సభ్యుల నుండి ఈకేవైసీ స్వీకరిస్తున్నారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉండటం వల్ల కొంత మంది రైతులు అందుబాటులో లేకపోవటంతో కొంత ఆలస్యం అవుతుందని సిబ్బంది వెల్లడించారు.



ఆటో ద్వారా మైక్ ప్రచారం

సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు కేబీఆర్ విద్యార్థులు



కె.హరిప్రియ



డి.హేమంత్



ఎస్‌కె.ఎం.డి.తౌఫిక్



షేక్.అబ్దుల్‌రజాక్

నరసరావుపేట ఈస్ట్: సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల క్రికెట్ పోటీలకు నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు కాసు బ్రహ్మానందరెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్.వి.నాగిరెడ్డి శనివారం తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాలల పురుషులు, మహిళల క్రికెట్ పోటీలలో ప్రతిభ చాటినట్లు చెప్పారు. వర్సిటీ పురుషుల జట్టుకు డి.హేమంత్, ఎస్‌కె.ఎం.డి.తౌఫిక్, షేక్.అబ్దుల్‌రజాక్, మహిళా జట్టుకు కె.హరిప్రియ ఎంపికయ్యారని వివరించారు. ఈనెల 14వ తేదీ నుంచి చెన్నైలోని మద్రాస్ యూనివర్సిటీలో నిర్వహించనున్న పురుషుల సౌత్ జోన్ పోటీలు, మైసూర్ యూనివర్సిటీలో జరగనున్న మహిళల సౌత్‌జోన్ క్రికెట్ పోటీలలో తమ విద్యార్థులు ఏఎన్‌యూకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నాగిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.వెంకటశివ, పీడీ ఎం.వినీల్ అభినందించారు.

విద్యుత్ ఫీడర్ల పనులకు శ్రీకారం

ఈపూరు(శావల్యాపురం): మండలంలోని కొచ్చెర్ల, ఊడిజర్ల గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో నూతనంగా 33 కేవీ విద్యుత్ సామర్థ్యం కలిగిన లైను పనులకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా నరసరావుపేట డీఈ సి.హెచ్.రాంబొట్ల మాట్లాడుతూ మండల ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించటానికి రూ.కోటి 30 లక్షలతో నూతన ఫీడర్ ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ కోతలు తగ్గించటంతో పాటు వ్యవసాయానికి పగలు తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా, లోవోల్టేజ్ సమస్య అధిగమించటానికి అందించటానికి దోహదపడుతుందని వివరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఫీడర్ ద్వారా వినుకొండ నుంచి నేరుగా విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీఈలు భవనం వెంకటేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి,శ్రీనివాసరావు, ఏఈ సంపెంగుల గాంధీ పాల్గొన్నారు.



ఫీడరు ప్రారంభోత్సవంలో పాల్గొన్న డీఈ రాంబొట్ల

గాలి పటాలు విద్యుత్ తీగలకు తగలకుండా చూడాలి

సంక్రాంతి సందర్భంగా గాలిపటాలు ఎగురువేసే సమయంలో చిన్నారుల తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు పాటించాలని నరసరావుపేట డీఈ సిహెచ్.రాంబొట్ల శనివారం తెలిపారు. విద్యుత్ లేని ప్రాంతాల్లో ఎగుర వేయాలని సూచించారు.

ఆదమరిస్తే.. ఆస్పత్రికే..



అండర్ గ్రౌండ్ బ్రిడ్జి సైడ్ డ్రైన్ ప్రమాదభరితంగా మారింది. ఆర్‌యూబీలో వర్షపు నీరు పారేందుకు డ్రైన్‌ను నిర్మించి దానిపై ఇనుప జల్లెడ ఏర్పాటు చేశారు. ఇనుప చువ్వలు విరగడంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అటుగా నిత్యం వేలాది మంది ద్విచక్రవాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. చువ్వలు విరిగి గుంతగా ఏర్పడటంతో వాహన టైర్లు అందులో ఇరుక్కొని ద్విచక్ర వాహనదారుల గాయాల పాలవుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

-నరసరావుపేట టౌన్

నేటి నుంచి ముప్పాళ్లలో కబడ్డీ పోటీలు

ఈపూరు(శావల్యాపురం): వినుకొండ నియోజకవర్గం ఈపూరు మండలం ఆరేపల్లి ముప్పాళ్ల గ్రామంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా నేడు సాయంత్రం 4 గంటలకు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభించుతున్నట్లు రైతుమిత్ర కమిటీ ప్రతినిధి తల్లపనేని రామారావు శనివారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కబడ్డీ పోటీలకు నేటి నుంచి ఈనెల 17 వరకు జరుగుతాయన్నారు. ఉత్తర్‌ప్రదేశ్, హర్యాయనా,పంజాబ్,మధ్యప్రదేశ్,రాజస్థాన్,వెస్ట్ బెంగాల్,తమిళనాడు, ఆంధ్రప్రదేశ్,తెలంగాణా రాష్ట్రాల నుంచి 50 జట్లు పోటీలకు పాల్గొనటానికి సిద్ధం అయినట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే కబడ్డీ టీమ్స్, కోచ్ సభ్యులకు ఉదయం అల్పాహారం, రెండు పూటల భోజన వసతి ఉచితంగా ప్రయాణపు ఖర్చులు అందజేస్తామన్నారు. పోటీలను ప్రభుత్వ చీఫ్‌విప్ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు, నరసరావుపేట శాసన సభ్యులు చదలవాడ అరవిందబాబులు ప్రారంభిస్తారన్నారు.

వడ్డే ఓబన్న మనందరివాడు

ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్ బాబు

నరసరావుపేట: భారత స్వాతంత్ర్య పోరాటంలో రేనాటి రాజుల కాలంలో వడ్డే ఓబన్న బ్రిటిష్ వారిని ఎదిరించి పోరాడిన ప్రతిభను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. శనివారం వడ్డే ఓబన్న జయంతిని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. తొలుత ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కులం కన్నా గుణం గొప్పదని, మతం కన్నా మానవత్వం గొప్పదని పేర్కొంటూ వడ్డే ఓబన్న మనందరి వాడన్నారు, తహసీల్దార్ వేణుగోపాలరావు, బీసీ వెల్ఫేర్ అధికారులు, వడ్డెర సంఘ నాయకులు వల్లేపు నాగేశ్వరరావు, దేవల వెంకటేశ్వర్లు, కుంచాల వెంకట్రావు, వేముల పాండు, బత్తుల వెంకటేష్, కుంచాల కోటేశ్వరరావు, వల్లెపు లక్ష్మయ్య పాల్గొన్నారు.



ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ, వడ్డెర నాయకులు

విప్పర్లలో వరిగడ్డి వామి దగ్ధం



రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో షేక్ కొండపల్లి హిమాం సాహెబ్‌కు చెందిన నాలుగు ఎకరాల్లోని వరిగడ్డి కట్టల వామి దగ్ధమయ్యింది. ఈ ప్రమాదంలో రూ.25 వేల రూపాయల విలువ చేసే వరిగడ్డి నష్టం అయ్యింది. సమాచారం అందుకున్న నరసరావుపేట అగ్నిమాపక సిబ్బంది శకటంతో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. గ్రామస్తులు అప్రమత్తం అవటంతో మంటలు పక్కకు చేరకుండా జాగ్రత్త పడ్డారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రైతు బాగుంటే దేశం బాగుంటుంది

యడ్లపాడు:రైతు సంతోషంగా ఉంటేనే దేశం బాగుంటుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో రూ.2.30 లక్షలతో నిర్మించిన మినీ గోకులం షెడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోకులం షెడ్లను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని, అప్పుడే ప్రభుత్వ ఆలోచనలు సఫలీకృతం అవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హేమలతాదేవి, సర్పంచ్ పుల్లగూర ప్రభావతి, టీడీపీ నాయకులు కామినేని సాయిబాబు, పావులూరి శ్రీనివాసరావు, పావులూరి పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్‌లోని సన్నిధి వెంకట ఆంజనేయులు, నాసరమ్మ ధ్యానమందిరంలో శ్రీ శంకర సత్సంగం వారి ఆధ్వర్యంలో ధనుర్మాస సందర్భంగా గత 26 రోజుల నుంచి ఘనంగా జరుగుతున్నది. 27వ రోజు కుడారై ఉత్సవం జరిగింది. ఈ ఉత్సవంలో మహిళా మణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ ధ్యాన మందిరం దాతలు అమెరికాలో నివాసం ఉంటున్న సన్నిధి వెంకట రాజేంద్ర ప్రసాద్, మల్లీశ్వరి, సన్నిధి వెంకట రామకృష్ణ, లలిత దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

చందవరంలో క్రికెట్ ప్రీమియర్ లీగ్

ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి



చందవరంలో క్రికెట్ బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

నాదెండ్ల: క్రీడలతో యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. చందవరం గ్రామంలో శనివారం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను టాస్ వేసి ఆయన ప్రారంభించారు. కొద్దిసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజలకు సంక్రాంతి అతి పెద్ద పండుగని, సంప్రదాయాలతో కూడిన క్రీడలు వినోదం పెంచుతుందన్నారు. క్రికెట్ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చూపిన క్రీడాకారుల పేరును రాష్ట్ర స్థాయిలో సిఫార్సు చేస్తానన్నారు. అనంతరం క్రీడాకారులకు టీషర్ట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో యన్నం వెంకటరామిరెడ్డి, సిద్ధారెడ్డి, బుల్లియ్య, చిన్నపుల్లారెడ్డి, టీడీపీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, గట్టినేని రమేష్, కామినేని సాయిబాబు, కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే మంచిది

చిలకలూరిపేట: క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించటం ద్వారా వ్యాధికి సమర్థవంతంగా చికిత్స అందించవచ్చని సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ ముద్దన రమేష్ బాబు చెప్పారు. ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని కేజే ఆసుపత్రిలో ఒమేగా క్యాన్సర్ ఆసుపత్రి సహకారంతో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమేష్ బాబు మాట్లాడుతూ ప్యాప్ స్మియర్ పరీక్ష చేసి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందో లేదో తెలుసుకోవచ్చన్నారు. కన్సల్టెంట్ రేడియేషన్ అంకాలజిస్టు డాక్టర్ పి.గీతా రుక్మిణి మాట్లాడుతూ రొమ్ములలో గడ్డలు, రొమ్ము మొనల నుంచి ద్రవం కారడం, చర్మంలో మార్పులు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం క్యాన్సర్ నుంచి రక్షణ పొందేందుకు వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. తొమ్మిది నుంచి 14 సంవత్సరాల లోపు పిల్లలకు రెండు డోసులు, 14 సంవత్సరాలు పైబడిన వారికి మూడు డోసులు క్యాన్సర్ వ్యాక్సిన్ వేయించుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా స్త్రీలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ పరీక్షలతో పాటు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కరణం విజయలక్ష్మి, పెథాలజిస్టు డాక్టర్ వి రాధిక, డాక్టర్ శుభశ్రీ, సర్వీన్‌భాను, ఒమేగా ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అంత హడావిడిగా ప్రయాణిస్తే ఎలా?



మండలంలోని విప్పర్లపల్లి గ్రామ సమీపంలో ఎరువుల బస్తాలతో వెళ్తున్న లారీ అదుపు తప్పి ఏడుగడియల వాగులో పల్టీ కొట్టింది. నరసరావుపేట నుండి రసాయనిక ఎరువుల బస్తాల లోడ్‌తో కంభం వెళ్తున్న లారీ వేగంగా వస్తూ ఏడుగడియల వాగు సమీపంలోని రోడ్డు మలుపులో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో రోడ్డు పక్కనే ఉన్న ఎక్స్‌ఎల్ మోటార్ సైకిల్‌పై లారీ పడటంతో వాహనం నుజ్జునుజ్జయింది. ఈ వాహనం ఆ గ్రామానికి చెందిన కె. శ్రీనివాస రెడ్డిదిగా గుర్తించారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

-రొంపిచర్ల

నేటి నుంచి లింగారావుపాలెంలో సంక్రాంతి సంబరాలు

యడ్లపాడు: మండలంలోని లింగారావుపాలెం గ్రామంలో ఆదివారం నుంచి సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవై ఎఫ్ఐ) ఆధ్వర్యంలో 45వ సంక్రాంతి సాంస్కృతిక క్రీడోత్సవాల్లో భాగంగా వీటిని 12 నుంచి 14వ తేదీ నుంచి వరుసగా నిర్వహించే ఈపోటీలకు గ్రామ ప్రజలతో పాటు విజన్ ఫౌండేషన్, ఎల్‌డీటీ, ఎన్నారైల సహకారం ఇస్తున్నట్లు తెలిపారు. బహుమతి ప్రదానోత్సవ సభ సభకు డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై రాము ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్ని గ్రామస్తులతో పాటు సమీప ప్రాంత వాసులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సాతులూరులో..

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో ఈ నెల 13 నుండి మూడు రోజుల పాటూ సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నారు. కాకతీయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న సంబరాలకు హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. 13న క్రికెట్, కబడ్డీ, షటిల్ పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు, రాత్రి ప్రముఖ గాయకులు జయరాజు కచేరీ జరగనుంది.

ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి



చిలకలూరిపేట: శ్రీకాకుళంలో ఫిబ్రవరి 6 నుంచి 9 వరకు నిర్వహించే అఖిలభారత యువజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ చినబాబు, కె.మల్లిఖార్జునరావు కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందని విమర్శించారు. దేశంలో మహిళలపై చిన్నారులపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నా నిలువరించే పరిస్థితి లేకపోవడం బాధాకరమన్నారు. ఉత్తరాంధ్ర జీవనాడిగా ఉన్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరించేందుకు కేంద్రం పూనుకోవడాన్ని యువత వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వత్తాసు పలకడం వారి అసమర్థతకు నిదర్శమన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



సీఆర్ కళాశాలలో భోగిమంటలు వేసిన అధ్యాపకులు, విద్యార్థులు



యడ్లపాడులో కుర్చీలాట ఆడుతున్న మహిళలు

నాదెండ్ల: గణపవరం చుండి రంగనాయకులు కళాశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. భోగిమంటలు వేసి రంగవల్లులు తీర్చిదిద్దారు. గంగిరెద్దుల ప్రదర్శన, హరిదాసుల కీర్తనలతో తెలుగు సాంప్రదాయ శోభ మురిపించింది. బొమ్మల కొలువు ఏర్పాటు చేసి చిన్నారులపై భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. పొంగళ్లు పొంగించారు. ఉట్టికొట్టడం, కబడ్డీ పోటీలు, కుర్చీలాట, కోలాటం, లెమన్ స్పూన్, టగ్ ఆఫ్ వార్, పాటల పోటీలు, ర్యాంప్‌వాక్, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చుండి వేణుగోపాల్, డైరెక్టర్ చుండి రంగనాయకులు, ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు, వైస్‌ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య బహుమతులు అందించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

యడ్లపాడులో....

యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడులో సంక్రాంతి పండుగ సందర్భంగా పలు ఆటల పోటీలు నిర్వహించారు. స్థానిక పోపూరి రామారావు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో 90 మంది మహిళలు, బాలబాలికలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ (నూజెండ్ల): పట్టణంలోని సాయి డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎం. నాగేంద్రకుమార్, కృష్ణవేణి జూనియర్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బి.లింగారావు, డైరెక్టర్ కె.సాయికుమార్, బి.మల్లికార్జునరావు, ఎం. చంద్రమోహన్‌లు హాజరయ్యారు.

సేవాసంస్థలు రాష్ట్రాభివృద్ధిలోనూ పాలుపంచుకోవాలి

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట టౌన్: సేవాతత్పరతతో ముందుకు సాగుతున్న అసిస్ట్ సంస్థ చిలకలూరిపేటలో ఉండటం చుట్టుపక్కల నియోజకవర్గాలకే గర్వకారణమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శనివారం అసిస్ట్ సంస్థ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రత్తిపాటి సంస్థ డైరెక్టర్ జాష్టి రంగారావు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు అసిస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.



రంగారావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

కోడిపందెలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు

నరసరావుపేట రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడిపందాలు, జూదం నిర్వహించిన, ఆడిన కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్సై సి.హెచ్ కిశోర్ తెలిపారు. కోడిపందేలు నిర్వహించే అవకాశం ఉన్న మండలంలోని పలు గ్రామాల్లో ఎస్ఐ పర్యటించారు. కోడిపందెలు, జూదంకు దూరంగా ఉండాలని సూచించారు. కోడిపందేలు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్టు తెలిపారు. కోడిపందేలు ఎక్కడైనా నిర్వహిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. నిర్మానుష్య ప్రాంతాల్లో నిషేధిత ఆటలు నిర్వహించకుండా డ్రోన్స్‌తో నిఘా ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

కోడి పందేలపై ప్రత్యేక నిఘా

రొంపిచర్ల: మండలంలో కోడి పందేలు, జూదం నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు చేపడతామని ఎస్ఐ డి.అశోక్ హెచ్చరించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా యువత కోడి పందాలు, జూదం నిషేధిత ఆటలకు దూరంగా ఉండాలన్నారు. నిర్మానుష ప్రదేశాలలో నిషేధిత ఆటలు నిర్వహించకుండా ప్రత్యేక డ్రోన్స్‌తో నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.